క్లుప్తంగా

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభిస్తారని గ్రామ సర్పంచ్ జయశ్రీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ తదితర వాటిని ప్రారంభించనున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వల్లి

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ, ల్యాబ్, మందులను, రికార్డులను పరిశీలించారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. మందుల కొరత ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే పెసవాండ్లపల్లె గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నారా లేదా అని ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రేపు సేవకులకు సన్మానం

వీరపునాయునిపల్లె : ప్రభుత్వం తరపున ప్రజలకు సేవలు అందిస్తున్న సేవకులకు మండల కేంద్రంలోని ఒంటిగారి రామసుబ్బన్న డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. 22 పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయ కులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

నీతిని గ్రహించాలి



విద్యార్థులకు నీతి కథలను బోధిస్తున్న సుధాకర్

కమలాపురం : ప్రతి విద్యార్థి నీతి కథలు చదవాలని, అలాగే అందులో దాగి ఉన్న నీతిని గ్రహించాలని ఇరిగేషన్ శాఖ టెక్నికల్ ఆఫీసర్ కె.సుధాకర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆయన నీతి కథలు చదివించారు. అలాగే పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు పుస్తక పఠనం చేయాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న సయయంలో వివిధ దిన పత్రికలు, నవలలు, నీతి కథలు చదువడం అలవాటు చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి నాగాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యూజ్ ఆఫ్ కాల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సేవలు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల సౌలభ్యం కోసం ఏవైనా సమస్యలుంటే ఫోన్ చేయాలన్నారు. పులివెందులకు చెందిన వారు 94906 15149, 9490152125, 7382647820, లింగాల 9490612053, సింహాద్రిపురం 94906 15158, తొండూరు 9490615152, వేంపల్లె 94906 15164, తాళ్లపల్లె 9490615166, వేముల 94906 15161, చక్రాయపేట 9490915167 అనే ఫోన్ నెంబర్లకు విద్యుత్ వినియోగదారులు సంప్రదించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ రాక

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే క్రాస్ రోడ్డు వద్ద సమగ్ర తాగునీరు సరఫరా పథకం కార్యక్రమానికి భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం కమలాపురం 1వ వార్డు సచివాలయం పరిధిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు ఎమ్మెల్యే హాజరు అవుతారని ఆయన తెలిపారు. అన్ని శాఖల మున్సిపల్ అధికారులు హాజరై ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మెప్మా కార్యాలయంలో పర్యావరణ హిత జీవన శైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మెప్మా పథక సంచాలకులు సురేష్‌రెడ్డిలు హాజరై మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో పర్యావరణ యొక్క ప్రాముఖ్యత, ప్రజల పర్యావరణ పరిరక్షనకు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్‌ఆర్‌ఆర్ గురించి కార్యక్రమంలో ప్రజలకు తమకు అవసరమైన మేరకు వనరులు వినియోగించుకోవడం, ఇతరులకు ఉపయోగపడే వస్తువులు వేస్ట్ చేయకుండా వాడుకునేవారికి వినియోగించే విధంగా పనికిరాని వస్తువులను ఉపయోగించి పనికొచ్చే వస్తువులను తయారీ, వినియోగం గురించి విషదీకరించారు. అనంతరం పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించి సభ్యులందరిచేత పర్యావరణ హిత జీవన శైలిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మెప్మా సీఎంఎం గంగులయ్య, సీఓలు నాయుడు, నాగన్న, హరిత, సచివాలయ శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు భూమి పూజ



తాగునీటి పైప్‌లైన్‌కు భూమి పూజ చేస్తున్న ఉత్తమారెడ్డి

కమలాపురం : మండలంలోని చిన్నచెప్పలి గ్రామానికి తాగునీరు అందించడానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచి రూ.22లక్షల డీఎంఎఫ్ నిధులు విడుదల చేయించారు. ఈ పైప్‌లైన్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఇతర నాయకులు, అధికారులతో కలసి మంగళవారం భూమి పూజ చేశారు. ఇటీవల చిన్నచెప్పలి గ్రామానికి తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో చర్చించి రూ.22లక్షల నిధులు మంజూరు చేయించారు. తక్షణం పనులు ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో లేటపల్లె నుంచి చిన్నచెప్పలి వరకు పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు నీటి సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ బుజ్జన్న, స్థానిక నాయకులు పుల్లారెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సురేష్ యాదవ్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని చిటిమిటిచింతల గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి గంగాధర్ తెలిపారు. చిటిమిటిచింతల (పాటి) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద నుంచి ఈ కార్యక్రమంను ప్రారంభిస్తారన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం తదితర తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు సిద్ధయ్య నీతి కథలు చెప్పడంతోపాటు విద్యార్థులచే కథలు చదివించారు. అనంతరం విద్యార్థులకు చెరుకు రసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి, రిటైర్డు పీఈటీ కొండారెడ్డి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ కోరారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్ కార్యాలయంలో ముద్దనూర్ మండల ఎస్టీయూ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

బదిలీలు ఉపాధ్యాయులకు మేలు కలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర నాయకుడు విద్యాసాగర్ నిర్వహించారు. ఎస్టీయూ ముద్దనూరు మండల అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్ పీరా, ప్రధాన కార్యదర్శిగా పట్నం మునిశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటసుబ్బయ్య, అజయ్‌కుమార్, సుబ్బయ్య, లక్ష్మీచౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం సాగించాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : చేనేత కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం సాగించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలపారు. మంగళవారం మండల కేంద్రంలో చేనేత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎంపికను ఆయన నిర్వహించారు. అధ్యక్షుడిగా సంజీవరాయుడు, కార్యదర్శిగా ముని కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, సభ్యులుగా బొలిశెట్టి వెంకటేశ్వర్లు, శివశంకర్, గిరిగ కృష్ణను ఎన్నుకున్నారు.

సాంకేతిక విద్యతోనే యువతకు ఉపాధి



సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్

జమ్మలమడుగు : యువతకు సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో అసిస్టెంట్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌ల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు సాంకేతిక పరమైన విద్యను అందించి చదువు పూర్తి కాగానే వారు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపరచుకునేటందుకు కాలేజీలలో సాంకేతిక విద్యను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి నాగార్జున మాట్లాడుతూ ప్రతి యువత ఏదో ఒక రంగంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకుని తమ కాళ్లమీద తాము నిలబడే విధంగా చేయడంతోపాటు మరికొంత మందికి వీరు ఉపాధి కల్పించేవిధంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన 60 మందికి చైర్‌పర్సన్ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

25న హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప కల్చరల్ : పవిత్ర హజ్ యాత్రికులకు ఈనెల 25న ఉచితంగా వ్యాక్సినేషన్ చేయనున్నట్లు ది ముస్లిం అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం.ఫైజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్రాసురోడ్డులోగల ముస్లిం ఆర్ఫనైజ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జిల్లా హజ్ సొసైటీ, ముస్లిం అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హజ్‌కమిటీ ద్వారా హజ్–2023కు వెళ్లనున్న యాత్రికులకు ఈ ఉచిత వ్యాక్సినేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయించుకోవచ్చని, వారికి నిర్వాహకులు హెల్త్‌కార్డులు అందజేస్తారన్నారు. యాత్రకు అవసరమయ్యే ఎహరామ్ దుస్తులతోపాటు ఇతర సామాగ్రి తక్కువ ధరకు అందించే ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 95094 47737 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

హిజామాతో మానసిక రుగ్మతలు దూరం



కప్పింగ్ థెరఫి నిర్వహిస్తున్న వైద్యులు

జమ్మలమడుగు : మనిషిలో ఉన్న అన్ని రకాల మానసిక రుగ్మతలను దూరం చేసేది హిజామా(కప్పింగ్ థెరపి) అని వైద్యులు ముస్తి మహమ్మద్ ఆలీ బోగ్దాది, ఖలీల్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక ఆస్తానయే గౌసియా 91 ఉరుసు మహోత్సం సందర్భంగా పీఠాధిపతి ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ అయిన సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ ఆధ్వర్యంలో హిజామా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కప్పింగ్ థెరఫి ద్వారా అస్తమా, డిప్రషన్, చర్మవ్యాధులు బరువు తగ్గడం, మానసిక రుగ్మత, ఆడవారికి సంతాన సాఫల్యం, మహిళల సమస్యల నుంచి శాశ్విత ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ వైద్య పరీక్షల్లో 170 మందికి కప్పింగ్ థెరఫి నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి కుమారుడు సయ్యద్‌షా తాహీర్ పీరాఖాద్రీ, సోదరుడు సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకుడికి సీఎస్ఆర్ నిధులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.వసుగోవర్ధన్ రెడ్డికి కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కింద రూ. 2 లక్షల నిధులను హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాసూటికల్ కంపెనీ 'డెనిస్కో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ మంజూరు చేసింది. ఆ సంస్థ సీఈఓ కమలాకర్ నుంచి వచ్చిన లేఖను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ చేతుల మీదుగా డా. వసుగోవర్ధన్‌రెడ్డి అందుకున్నారు. ఈ నిధులను పరిశోధనకు వినియోగించుకోవచ్చని సదరు సంస్థ సూచించింది. కాగా డా. వసుగోవర్ధన్‌రెడ్డి ఇదివరకే జర్మనీ దేశం నుంచి అలెగ్జాండర్ వాన్‌హంబోల్ట్ అవార్డు, యూజీసీ రామన్ ఫెలోషిప్, డీఎస్టీ యంగ్‌సైంటిస్ట్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను వీసీతో సహా పలువురు అధ్యాపకులు అభినందించారు.

రేపటి నుంచి విద్యార్థినులకు అవార్డుల ప్రదానం



వెన్నపూస రేఖ




ఎల్.మోహనరూప

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆణిముత్యాల అవార్డులకు పులివెందుల వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్‌కు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సర సీఈసీ విభాగపు విద్యార్థిని వెన్నపూస రేఖ, హెచ్‌ఈసీ విద్యార్థిని ఎల్.మోహనరూపలు ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాల అవార్డులకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. అలాగే జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాల అవార్డుకు వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన సీఈసీ విభాగపు విద్యార్థిని వెన్నపూసరేఖ ఎంపికైంది. ఎంపికైన విద్యార్థినులకు ఈనెల 25న జిల్లాస్థాయిలో రూ.50వేలు, ఈనెల 27వ తేదీన నియోజకవర్గ స్థాయిలో ఇద్దరు విద్యార్థినులు రూ.15వేల నగదును అందుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థినుల తల్లిదండ్రులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆణిముత్యాలకు విద్యార్థుల ఎంపిక

జమ్మలమడుగు : పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదు మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైనట్లు ఎంఈఓ క్రిష్టఫర్ తెలిపారు. మంగళవారం స్థానిక పీఆర్ ఉన్నతపాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైలవరం మండలంలోని గురుకుల పాఠశాలకు చెందిన జయప్రద, నీహారిక, కీర్తన, జమ్మలమడుగు పీఆర్ ఉన్నతపాఠశాలకు చెందిన వరుణ్‌బాబు, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాయిసహస్రలు ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. వారికి ఈనెల 25వ తేదీన పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సభాభవనంలో అవార్డు ప్రధానంతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వేంపల్లెలో..



షేక్ సమీరా

వేంపల్లె : జగనన్న ఆణిముత్యాల అవార్డుకు వేంపల్లె ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని షేక్ సమీరా ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.హబీబుల్లా తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో షేక్ సమీరా ఎంపీసీ విభాగంలో 948 మార్కులు సాధించి ఈ అవార్డుకు ఎంపికైందన్నారు. ఈనెల 25వ తేదీన పులివెందులలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్న పాఠశాలలో విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను సన్మానించడంతోపాటు విద్యార్థినికి ఈ అవార్డు కింద రూ.15వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందిస్తారన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ప్రసంగం

కడప ఎడ్యుకేషన్: నాన్ యాంగ్ టెక్నో విశ్వవిద్యాలయంలో సింగపూర్ వాబ్ క్రియేటివ్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మే 10,12 వ తేదీలలో నిర్వహించిన అంతర్జాతీయ గ్లోబర్ సింపోజియంలో లోతైన అంతర్జాతీయ సహకారాలు అనే అంశంపై కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ సహచార్యులుగా పనిచేస్తున్న రాజేంద్రకుమార్ ప్రసంగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. ఉత్తమ ప్రసంగం చేసిన రాజేంద్రకుమార్‌ను కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి అమర్‌నాథరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌లు అభినందించారు.

రీజినల్ డైరెక్టర్‌కు అభినందన

కడప కార్పొరేషన్: వైద్య, ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ అనిల్ కుమార్‌ను పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జంబారపు అహరోను తదితరులు అభినందించారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం



హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సుమారు వేలాది ఎకరాలలో అరటి పంటలు నేలకొరిగాయి. దీంతో నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, మల్లికార్జునపురం, వెలమవారిపల్లె, వెంకటాపురం గ్రామాల్లో రైతులు తమను ఆదుకోవాలని మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కర్నూలులో కలిశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత ఉద్యాన శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంట రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కావున 100, 200చెట్లు పడిపోయిన రైతులు వారి పేర్లను నమోదు చేయాలన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి హెచ్‌ఓను కలిసి పంట నష్టాన్ని నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ రాజారెడ్డి వర్ధంతి



నివాళులర్పిస్తున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణస్వామి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల పెద్దాయన దివంగత వైఎస్ రాజారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణరెడ్డి హాజరై దివంగత వైఎస్ రాజారెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీఎం ఆంజనేయులు, కాంట్రాక్టర్ రమణ, వికలాంగుల సంఘ కార్యవర్గ సభ్యులు బాబు, అనిల్, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి సారూ..



పట్టాదారు పాసు పుస్తకాన్ని చూపుతున్న నాగసుబ్బమ్మ

కమలాపురం : మండలంలోని మొలకవారిపల్లెకు చెందిన చింతా నాగసుబ్బమ్మ అనే మహిళా రైతు తన భూ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటోంది. మంగళవారం ఆమె కమలాపురంలో విలేకరుల ఎదుట తన గోడును వెళ్లబోసుకుంది. నంబటూరు పొలాల్లో సర్వే నెంబర్ 334/3లో తనకు 1.86 ఏకరాల పొలం ఉందని, అయితే ఇందులో 6 సెంట్ల స్థలాన్ని 2006లో మైలవరం దక్షిణ కాలువ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుందన్నారు. నష్టపరిహారం కూడా ప్రభుత్వం తనకు ఇచ్చిందన్నారు. అయితే అధికారులు చేసిన తప్పిదం వలన నా భూమి పూర్తిగా కాలువ కిందనే ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, దీని వలన తాను మార్టిగేజ్ చేసుకోలేక పోతున్నానని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. తన పొలంలో 6 సెంట్లు కాలువ నిర్మాణానికి పోను మిగిలిన 1.80 ఏకరాల స్థలం తనదేనని రెవెన్యూ రికార్డుల్లో చూపించాలని ఆమె కోరారు. అధికారుల దృష్టికి పలు మార్లు ఈ సమస్య తీసుకెళ్లినా స్పందించడం లేదని, కనీసం ఇప్పటికైనా నా రెవెన్యూ అధికారులు స్పందించి తన భూ సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ సమస్య కారణంగా తాను రుణం పొందలేక పోతున్నానని ఆమె తెలిపారు.

జాగ్రత్తలతో వడదెబ్బను నివారించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

కమలాపురం : ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉటుందని, చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బను నివారించవచ్చని స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పి.ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వడదెబ్బ నివారణపై ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి రైల్వే గేటు వరకు ర్యాలీ జరిగింది. ప్రజలకు వడదెబ్బ నివారణపై ఆయన అవగాహన కల్పించారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బను నివారించవచ్చన్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు రాకూడదన్నారు. ఉదయం 10 గంటలలోపే పనులు ముగించుకుని ఇంటికి చేరాలన్నారు. తలకు టోపీ లేదా రుమాలు ధరించాలన్నారు. మంచినీరు, గ్లూకోజ్, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవడం వలన వడదెబ్బను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన కాయలకు రిజిస్ట్రేషన్లు

వేముల : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల కోసం ఆయా రైతు భరోసా కేంద్రాలలో బుధవారం నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వేముల మండలానికి కె6రకం వేరుశనగ విత్తన కాయలు 800 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం సబ్సిడీ విత్తన కాయలను అందిస్తోందన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు విత్తన ప్యాకెట్లను అందిస్తామన్నారు. 30 కేజీల ప్యాకెట్ ధర రూ.1674లుగా నిర్ణయించామని.. విత్తన కాయలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

సింహాద్రిపురం : మండల పరిధిలోని రైతులందరూ సబ్సిడీ వేరుశనగ కాయలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీనుంచి సబ్సిడీ వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్నామని.. అవసరమైన రైతులు ఆయా ఆర్‌బీకే కేంద్రాలలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కేజీ వేరుశనగ విత్తన కాయలు రూ.93లు కాగా.. సబ్సిడీపోనూ రూ.55.80లుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. వేరుశనగ విత్తన కాయలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల్లో ఖాళీలన్నింటిని చూపించాలి

– ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే టీచర్ల బదిలీలలో ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నింటిని చూపించాలని ఆ మేరకు బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలోని ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల సుదీర్ఘంగా దూర ప్రాంతాల్లో పనిచేసిన సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతులకు మాన్యువల పద్ధతిలో కౌన్సిలింగ్‌ను నిర్వహించాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, శ్రీనివాసులరెడ్డి, గురవయ్య, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు ప్రసాద్, శివానందం, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పందిరి బండి.. అదిరిందండి!



కడప రూరల్: మండే ఎండలు మనిషులనే కాదు మూగజీవాలకూ 'ఉక్క'రిబిక్కిరి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఓ ఒంటెద్దు బండి యజమానికి ఇదిగో ఇలా బండికి పందిరి కట్టి తనతో పాటూ కోడెద్దునూ ఎండ సెగల నుంచి కాపాడుకుంటున్నాడు. ఎండ తగల కుండ పాత సంచి, వస్త్రాలతో పందిరిలా ఏర్పాటు చేసుకోవడం పలువురిని ఆకర్షించింది.కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లో కనిపించిని చిత్రమిది. మూగ జీవాల పట్ల ప్రేమను చూపడంతో జంతు ప్రేమికులూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.